సాక్షి
ఖమ్మం
మంగళవారం ၊ 29 ၊ ఏప్రిల్ ၊ 2025



నృత్యం.. కళారూపం

వివిధ నృత్యరీతుల్లో జిల్లా కళాకారులు రాణిస్తుండడమే కాక మరికొందరు పోటీల్లో సత్తా చాటేలా తర్ఫీదునిస్తున్నారు. 8లో



తరుగు లేకుండా కొనాలి

తేమ, తరుగు పేరిట కొర్రీలు పెట్టకుండా ధాన్యం కొనాలనే డిమాండ్‌తో వైరా మార్కెట్ ఎదుట రాస్తారోకో నిర్వహించారు. 8లో

గరిష్టం / కనిష్టం
40°/ 26°

వాతావరణం

జిల్లాలో మంగళవారం ఉదయం నుంచే ఎండ ప్రభావం ఉంటుంది. మధ్యాహ్నంకల్లా గరిష్టస్థాయికి చేరి వడగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

నేటి నుంచి ఎప్‌సెట్

ఖమ్మం సహకారనగర్: ఇంజనీరింగ్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలు కల్పించేందుకు నిర్వహించే ఎప్‌సెట్ మంగళవారం నుంచి మే 4వ తేదీ వరకు జరగనుంది. ఇంజనీరింగ్ అభ్యర్థులకు ఏడు, ఫార్మసీ, అగ్రికల్చర్ పరీక్షకు ఆరు సెంటర్లు కేటాయించగా... 9,500మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. ఈనెల 29, 30వ తేదీల్లో ఫార్మసీ, అగ్రికల్చర్, వచ్చేనెల 2, 3, 4వ తేదీల్లో ఇంజనీరింగ్ పరీక్షలు జరుగుతాయి. నిర్ణీత తేదీల్లో ఉదయం 9నుంచి 12గంటల వరకు, మధ్యాహ్నం 3నుంచి 6గంటల వరకు పరీక్షలు జరుగుతాయని, గంటన్నర ముందు నుంచే కేంద్రాల్లోకి విద్యార్థులను అనుమతిస్తామని అధికారులు తెలిపారు.

నేడు మంత్రి పర్యటన

ఖమ్మంవన్‌టౌన్: రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మంగళవారం జిల్లాలో పర్యటించనున్నారు. వరంగల్‌లో సమీక్ష అనంతరం ఆయన మధ్యాహ్నం 3గంటలకు ఖమ్మం చేరుకుంటారు. ఆతర్వాత 3-30గంటలకు నేలకొండపల్లి మండలం నాచేపల్లిలో రహదారి, సుర్దేపల్లిలో బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. అనంతరం సుర్దేపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో భూ భారతి చట్టంపై నిర్వహించే అవగాహన సదస్సులో మంత్రి పాల్గొంటారు.

అర్జీలు సత్వరమే పరిష్కరించాలి

ఖమ్మంసహకారనగర్: ప్రజావాణిలో వచ్చిన అర్జీలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఆమె అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డితో కలిసి ప్రజల నుంచి వినతులు, దరఖాస్తులు స్వీకరించారు. ఆతర్వాత అధికారులతో సమావేశమై అర్జీల పరిష్కారంపై సూచనలు చేశారు. డీఆర్వో పద్మశ్రీ, ఏఓ అరుణ, అధికారులు పాల్గొన్నారు.

హజ్ యాత్రికులకు వ్యాక్సిన్లు



వ్యాక్సిన్ వేస్తున్న వైద్య సిబ్బంది

ఖమ్మంవైద్యవిభాగం: హజ్ వెళ్లనున్న యాత్రికులకు ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో సోమవారం వ్యాక్సిన్లు వేశారు. మొత్తం 49మంది దరఖాస్తు చేసుకోగా, 42 మందికి వైద్య పరీక్షలు, వ్యాక్సినేషన్ పూర్తయింది. జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి చందూనాయక్, డాక్టర్ ప్రేమలత, చైతన్యతో పాటు హుస్సేన్, రమణ, నాగరాజు, మదన, ఇందిర, సావిత్రి, హితబాల, చంద్రమన, భవాని, కుసుమంబ పాల్గొన్నారు.

మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కేసు

ఖమ్మంక్రైం: రోడ్డు ప్రమాదాల నియంత్రణలో భాగంగా డ్రంకెన్ డ్రైవ్, మైనర్ల డ్రైవింగ్‌ను అరికట్టేందుకు విస్తృత తనిఖీలు చేస్తున్నట్లు పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ తెలిపారు. జిల్లావ్యాప్తంగా ఏడు రోజుల్లో 31 మైనర్ డ్రైవింగ్, 266 డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేశామని వెల్లడించారు. మైనర్లు డ్రైవింగ్ చేస్తూ పట్టుబడితే వారితో పాటు తల్లిదండ్రులు, వాహన యజమానులపై కేసు నమోదు చేసి వాహనాలు సీజ్ చేస్తున్నట్లు తెలిపారు. పిల్లలు వాహనాలు నడిపి ఎవరైనా చనిపోవడానికి కారణమైతే బైక్ యజమానికి మూడేళ్ల జైలు శిక్ష, జరిమానా తప్పదని హెచ్చరించారు. నిర్ణీత వయస్సు వచ్చాక డ్రైవింగ్ లైసెన్స్ తీసుకున్నాకే వాహనాలు నడపాలని సూచించారు. కాగా, ఈ ఏడాది మూడు నెలల్లో 243రోడ్డు ప్రమాదాలు జరిగితే 84 మంది మృతి చెందారని, మరో 686మందికి తీవ్ర గాయాలయ్యాయని సీపీ వెల్లడించారు. ఇలాంటి ప్రమాదాలను అరికట్టేందుకు వాహనాల తనిఖీ నిరంతరం కొనసాగుతుందని తెలిపారు.

ముందస్తు బడిబాట!

గత మూడేళ్లలో బడిబాట ద్వారా పాఠశాలల్లో చేరిన విద్యార్థులు	ఏడాది	2022-23	2023-24	2024-25
	విద్యార్థులు	2,451	3,314	12,586



వేపకుంట్లలో తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచడమే లక్ష్యంగా ఉపాధ్యాయులు కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టారు. బడిబాట నిర్వహణపై ప్రభుత్వ ఆదేశాలు రానప్పటికీ పలు పాఠశాలల ఉపాధ్యాయులు ముందుగానే గ్రామాల బాట పట్టారు. ప్రైవేట్ పాఠశాలల మాదిరిగా కరపత్రాలు ముద్రించి ప్రచారం చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు, విద్యార్థులకు అందే సౌకర్యాలను తల్లిదండ్రులకు వివరిస్తూ పిల్లలను చేర్పించాలని కోరుతున్నారు.

– సాక్షిప్రతినిధి, ఖమ్మం

ఇంటింటా ప్రభుత్వ ఉపాధ్యాయుల ప్రచారం

- వసతులపై తల్లిదండ్రులకు అవగాహన
- వచ్చే విద్యాసంవత్సరం బడుల్లో ప్రవేశాలు పెంచేలా కృషి

ఏటా జూన్ నెలలో...

పాఠశాలల్లో పిల్లల నమోదు కోసం ఏటా జూన్ నెలలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ఇందుకోసం ప్రభుత్వం షెడ్యూల్ విడుదల చేస్తుంది. జూన్ మొదటి వారం నుంచి 12వ తేదీ వరకు ఓసారి, పాఠశాలలు ప్రారంభమయ్యాక మరోసారి బడిబాట నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.

ఈసారి ముందుగానే..

జిల్లాలో 1,216 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా.. కొన్ని పాఠశాలల ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమాన్ని ముందస్తుగా నిర్వహిస్తున్నారు. వేసవి సెలవులు మొదలుకాగానే ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పిల్లల ఇళ్లకు వెళ్లి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులను కోరుతున్నారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ఉన్న వసతులు, నమోదైన ఫలితాలను ఉదాహరణలతో సహా వివరిస్తున్నారు.

మా బడి ఎలా ఉందంటే...

బడిబాట సందర్భంగా ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో ఎలాంటి విద్యాబోధన జరుగుతోంది, ఎలాంటి సౌకర్యాలు ఉన్నాయో విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు ఉపాధ్యాయులు వివరిస్తున్నారు. ఇంగ్లిష్ మీడియం ఉచిత విద్య, పుస్తకాలు, యూనిఫామ్ ఇవ్వడమే కాక మధ్యాహ్న భోజనం, రాగిజావ అందుతుందని.. స్కాలర్‌షిప్‌లు కూడా మంజూరవుతాయని చెబుతున్నారు. అంతేకాక ప్రభుత్వ పాఠశాలల్లోని ఉపాధ్యాయుల అర్హతలను వివరించి తల్లిదండ్రుల్లో నమ్మకం కలిగిస్తున్నారు.

కొత్త హంగులు

ప్రభుత్వ పాఠశాలలకు నియమించిన అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా నిర్వహణ బాధ్యతలు పర్యవేక్షిస్తున్నారు. ఈ కమిటీల ద్వారా రంగులు వేయించడంతో పాటు అవసరమైన మరమ్మతులు చేయించారు. అలాగే, పీఎంశ్రీ తదితర పథకాలతో వస్తున్న నిధుల ద్వారా ఫర్నీచర్, ల్యాబ్‌లు, క్రీడా పరికరాలు సమకూరుతున్నాయి. పీఎంశ్రీ పథకానికి జిల్లాలోని సింగరాయపాలెం, కుర్నవల్లి రఘునాథపాలెం, ముష్టికుంట్ల, మాదాపురం, ఆరెంపుల, కేజీ సిరిపురం, మామునూరు, అప్పల నరసింహపురం, గరికపాడు, మీనవోలు, పాతర్లపాడు, ఏన్కూరు పాఠశాలలు ఎంపికయ్యాయి.

పూర్వ వైభవం తీసుకొచ్చేలా..

ఏటా జూన్‌లో బడిబాట నిర్వహిస్తుండడంతో అప్పటికే పలువురు విద్యార్థులను తల్లిదండ్రులు ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పించి కొంత మేర ఫీజు కూడా చెల్లిస్తున్నారు. దీంతో ప్రభుత్వ ఉపాధ్యాయులు ప్రచారం చేసినా పెద్దగా ఫలితాలు రావడం లేదు. అలాంటి ఇబ్బంది ఈసారి ఎదురు కాకుండా ప్రభుత్వ ఉపాధ్యాయులు ముందస్తుగా బడిబాటకు శ్రీకారం చుట్టారు. పాఠశాలల్లోని వసతులు, బోధనను తల్లిదండ్రులకే కాక గ్రామపెద్దలకు వివరించి విద్యార్థుల సంఖ్య పెరిగేలా కృషి చేస్తున్నారు.

కొన్ని అభ్యంతరాలు

ప్రభుత్వ ఉపాధ్యాయుల ప్రచారంలో పలువురు తల్లిదండ్రుల నుంచి సానుకూల స్పందన వస్తున్నా ఇంకొందరు సమస్యలు ఏకరువు పెడుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువగా ఉండే రైతులు, కూలీలు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఇళ్లలో లేకపోవడంతో పిల్లలను హాస్టల్‌లో చేర్పించేందుకే ఆసక్తి కనబరుస్తున్నట్లు తెలిసింది. ప్రభుత్వ పాఠశాలలకు అమ్మాయిలకు పంపిస్తే రవాణా సౌకర్యం లేకపోవడంతో ప్రైవేట్‌కే మొగ్గు చూపుతున్నట్లు సమాచారం. అలాగే, నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ లేకపోవడం.. కొన్ని స్కూళ్లలో ప్రతీ తరగతికి ఒక టీచర్ లేకపోవడాన్ని కూడా ప్రస్తావించినట్లు తెలిసింది.

మంచి స్పందన వస్తోంది..



పలు గ్రామాల్లో ఈనెల 26, 27వ తేదీల్లో బడిబాట నిర్వహించాం. తల్లిదండ్రులు వారి పిల్లలను చేరుస్తామని తెలిపారు. హాస్టల్ లేకపోవడం ఇబ్బందిగా ఉంటుందని కొందరు.. అమ్మాయిలకు రవాణా సమస్య ఉందని ఇంకొందరు చెప్పారు.

– కె.శ్రీనివాసరావు, ఉపాధ్యాయుడు, జెడ్పీఎస్ఎస్, పెద్దగోపతి

భరోసా కల్పిస్తున్నాం..



ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందన్న భరోసాతో తల్లిదండ్రుల నుంచి సానుకూల స్పందన వస్తోంది. నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ లేకపోవడం.. ప్రతీ తరగతికి ఒక టీచర్ లేకపోవడంపై కొందరు నిరాసక్తత కనబరిచారు.

– పి.నాగేశ్వరరావు, ప్రధానోపాధ్యాయుడు, పీఎస్ వేపకుంట్ల

వర్షాలు వచ్చేలోగా పనులు పూర్తి



అండర్ గ్రౌండ్ డ్రైయినేజీ పనులపై సూచనలు చేస్తున్న మంత్రి తుమ్మల

యూజీడీ పనుల పరిశీలనలో మంత్రి తుమ్మల

ఖమ్మంమయూరిసెంటర్: జిల్లా కేంద్రంలో చేపట్టిన భూగర్భ డ్రెయినేజీ పనుల్లో భాగమైన పైప్ లైన్ పనులను వర్షాకాలం మొదలయ్యేలోగా పూర్తిచేయాలని రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. ఖమ్మం నగరపాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్యతో కలిసి బైపాస్ రోడ్డులో జరుగుతున్న భూగర్భ డ్రెయినేజీ పనులను ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ అమృత్ 2.0 పథకం ద్వారా రూ.189.50 కోట్లతో పనులు చేపడుతుండగా, ఖానాపురం ఊరచెరువు నుండి ధంసలాపురం చెరువు వరకు 9.6 కి.మీ. మేర పైప్‌లైన్ నిర్మించి, అంతర్గత పైప్ లైన్లను అనుసంధానం చేసి మురుగు నీటిని శుద్ధి కేంద్రానికి తరలిస్తామని చెప్పారు. ధంసలాపురంలో 44 మిలియన్ లీటర్లు, పుట్టకోటలో 9.5 మిలియన్ లీటర్ల సామర్థ్యం గల మురుగునీటి శుద్ధి కేంద్రాలను నిర్మించనున్నట్లు తెలిపారు. పనులు త్వరగా పూర్తయ్యేలా అదనపు సిబ్బంది, వాహనాలను సమకూర్చుకోవాలని సూచించారు. అనంతరం వైరా రోడ్డులోని యూజీడీని కూడా మంత్రి పరిశీలించారు. ఎస్ఈ రంజిత్, అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనుల తనిఖీ

మంత్రి పర్యటన అనంతరం ఖమ్మం చెరువు బజార్, పాత బస్టాండ్ వీధి వ్యాపారుల ప్రాంగణం ప్రాంతాల్లో కమిషనర్ అభిషేక్ అగస్త్య పరిశీలించారు. చెరువు బజార్‌లో ఖాళీ స్థలాలను శుభ్రం చేయించకపోవడంతో అధికారులను ప్రశ్నించారు. ఆయా ఖాళీ స్థలాలు వెంటనే శుభ్రం చేయించి, జరిమానా బోర్డులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వీధి వ్యాపారుల ప్రాంగణంలో షెడ్ నిర్మాణ పనులను పరిశీలించి, అక్కడి చలివేంద్రాన్ని మరోచోటకు మార్చాలని తెలిపారు. జటాయు మిషన్లతో ప్రతిరోజు ఉదయం 5గంటల నుంచే పనులు ప్రారంభించాలని సూచించారు.

అక్కసుతోనే మంత్రుల వ్యాఖ్యలు

రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర

ఖమ్మంమయూరిసెంటర్: బీఆర్ఎస్ రజతోత్సవ సభలో తమ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ప్రసంగానికి వచ్చిన స్పందన ఓర్వలేక కాంగ్రెస్ మంత్రులు అక్కసుతో మాట్లాడుతున్నారని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర అన్నారు. ఖమ్మంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్యతో కలిసి సోమవారం ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు, డైవర్షన్ పాలిటిక్స్‌తో ముందుకెళ్తున్న ఆ పార్టీకి ఎల్కతుర్తి సభ చెంపపెట్టులా నిలుస్తుందని అన్నారు. ఈ సభ ప్రభుత్వ తిరుగుబాటుకు చిహ్నంగా నిలవడమేకాక.. రాష్ట్ర ప్రజలు బీజేపీని సైతం దగ్గరకు రానివ్వరని తేలిపోయిందని చెప్పారు. రజతోత్సవ సభ పండుగలా జరిగిందని, ఈ ఏడాదంతా పార్టీ రజతోత్సవం నిర్వహించుకుందామని కేసీఆర్ పిలుపునిచ్చారని తెలిపారు. సభకు యువత ఎక్కువగా తరలిరావడంతో పాటు కాంగ్రెస్ పాలనతో విసుగు చెందిన ప్రజానీకం కేసీఆర్ ప్రసంగాన్ని ఆసక్తిగా విన్నారని చెప్పారు. ఈమేరకు సభ విజయవంతానికి సహకరించిన ఉమ్మడి జిల్లా నేతలు, ఇన్‌చార్జ్‌లు, నాయకులకు వద్దిరాజు, సండ్ర కృతజ్ఞతలు తెలిపారు. మాజీ ఎమ్మెల్యేలు కొండబాల కోటేశ్వరరావు, మదన్‌లాల్, జెడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు, డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, నాయకులు మక్బూల్, తిరుమలరావు, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ రవిచంద్ర, పక్కన మాజీ ఎమ్మెల్యే సండ్ర తదితరులు

రఘునాథపాలెం చేరిన సాగర్ జలాలు

- ఎత్తిపోతల పథకం ట్రయల్‌రన్ విజయవంతం
- నాలుగు నెలల్లో పూర్తయిన రూ.64కోట్ల విలువైన ప్రాజెక్టు



మంచుకొండ డెలివరీ పాయింట్ వద్ద రైతులు

రఘునాథపాలెం: రఘునాథపాలెం మండలంలోని సాగు భూములకు సాగర్ జలాలు అందించేందుకు ప్రధాన కాల్వపై నిర్మించిన మంచుకొండ ఎత్తిపోతల పథకం ట్రయల్ రన్ సోమవారం విజయవంతమైంది. నాలుగు నెలల క్రితం ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తరచుగా పర్యవేక్షించారు. కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, రాష్ట్ర జలవనరుల శాఖ సలహాదారుడు పెంటారెడ్డి, జలవనరుల శాఖ సీఈ రమేష్, ఎస్‌ఈ మంగళపూడి వెంకటేశ్వర్లు, ఈఈ అనన్య, డీఈ ఝాన్సీ నిరంతర పర్యవేక్షణతో రాత్రీపగలు తేడా లేకుండా రూ.65 కోట్ల విలువైన ప్రాజెక్టు పనులు శరవేగంగా పూర్తిచేశారు. ఈ పథకం ద్వారా మండలంలోని 34 చెరువులకు సాగునీరు అందించేలా 9.5 కి.మీ. మేర ప్రధాన పైపులైన్, ఆపై మినీ పైపులైన్లు వేశారు. కొందరు రైతులు తమ భూముల్లో పైప్‌లైన్ వేయడానికి అభ్యంతరం తెలిపినా నచ్చచెప్పి పనులు కొనసాగించారు. ఆపై మోటర్లు, పంపుసెట్ల సరఫరాలో జాప్యం జరిగితే పాలమూరు-రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ పథకం నుంచి తెప్పించి ట్రయల్ రన్ చేపట్టారు. రెండు రోజుల క్రితం నీరు విడుదల చేసినా పైపులైన్లలో లీకేజీలు రావడంతో సరిచేసి సోమవారం మధ్యాహ్నం రెండు గంటలకు ప్రత్యేక పూజల అనంతరం పంప్ హౌస్‌లో మోటార్లు ఆన్ చేశారు.

అన్నదాతల్లో హర్షం

ఊహించని విధంగా సాగర్ జలాలు తమ చెరువుల్లోకి చేరుతుండడంతో రఘునాథపాలెం మండల రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. మంచుకొండ వద్ద ఏర్పాటుచేసిన డెలివరీ పాయింట్‌కు సాయంత్రం 4-30 గంటలకు సాగర్ జలాలు చేరాయి. ఆపై 200 అడుగుల ఎత్తులో ఉన్న భూములు కూడా తడవడంతో రైతులు సంబురాలు జరుపుకున్నారు. 'మా పొలాల్లో సాగర్ జలాలు ఎప్పుడు ప్రవహిస్తాయా అని ఎదురుచూశాం. మంత్రి తుమ్మల కృషితో ఇది సాధ్యమై వేలాది ఎకరాలకు సాగునీరు అందనుంది' అని హర్షం వ్యక్తం చేశారు. కాగా, సాగర్ జలాలను సోమవారం మల్లేపల్లి చెరువుకు విడుదల చేయగా, బావోజీతండాకు చెరువుకు మంగళవారం విడుదల చేయనున్నారు.

వసతుల కల్పనకు కేంద్రం నిధులు

- ఖమ్మం పార్లమెంట్ సభ్యుడు రామసహాయం రఘురాంరెడ్డి
- 'దిశ' సమావేశంలో కేంద్ర ప్రభుత్వ పథకాలపై సమీక్ష



మాట్లాడుతున్న ఎంపీ రఘురాంరెడ్డి, పక్కన కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, అదనపు కలెక్టర్లు శ్రీజ, శ్రీనివాసరెడ్డి, కేఎంసీ కమిషనర్ అభిషేక్, వైరా ఎమ్మెల్యే రాందాస్

ఖమ్మంమయూరిసెంటర్: ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించేలా కేంద్ర ప్రభుత్వ నిధులు సంపూర్ణంగా వినియోగించుకోవాలని ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం ఆయన అధ్యక్షతన జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ(దిశ) సమావేశం నిర్వహించారు. ఇందులో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, అదనపు కలెక్టర్లు డాక్టర్ పి.శ్రీజ, పి.శ్రీనివాసరెడ్డి, వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్ తదితరులు పాల్గొన్నారు. తొలుత పహల్గాం మృతులకు నివాళులర్పించారు. అనంతరం శాఖల వారీగా కేంద్ర ప్రభుత్వ పథకాలపై అధికారులు నివేదికలు సమర్పించగా ఎంపీ మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధుల సమాచారం ఇస్తే తాను ఢిల్లీలో అక్కడి అధికారులతో చర్చిస్తానని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందించడమే కాక ఇతర పథకాల ద్వారా బడుగు, బలహీన వర్గాల ప్రజలకు లబ్ధి చేకూర్చాలని సూచించారు. అంతేకాక జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేయాలని అధికారులకు సూచించారు. ఖమ్మం అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పనులు, అవసరమైన పీహెచ్‌సీలు, సీహెచ్‌సీల నివేదికలు ఇవ్వాలన్నారు. కేంద్ర పథకాల ద్వారా నిధులను మరింత సమర్థవంతంగా వినియోగించుకునేలా ప్రణాళిక రూపొందించాలని, ప్రజాప్రతినిధుల సందేహాలను నివృత్తి చేయాలని ఎంపీ ఆదేశించారు.

అవగాహన కల్పిస్తున్నాం..

ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకం, ఇతర పథకాలపై యువత, మహిళలకు అవగాహన కల్పిస్తున్నామని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ తెలిపారు. అంతేకాకుండా ఆడపిల్లకు జన్మనిచ్చిన తల్లిదండ్రులను సన్మానిస్తున్నామని, ప్రతీ ప్రభుత్వ కార్యాలయం, షాపింగ్ మాల్స్‌లో దివ్యాంగుల కోసం ర్యాంప్‌ల నిర్మాణంపై దృష్టి సారించామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలను సంయుక్తంగా వినియోగించుకుంటూ మహిళలు వ్యాపార యూనిట్లు ఏర్పాటుచేసేలా పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. కాగా, జిల్లాలో అంధులకు ప్రత్యేక పాఠశాల ఏర్పాటు, 20 భవిత సెంటర్లకు వచ్చే దివ్యాంగుల కోసం రవాణా సౌకర్యం కల్పించాలని ఎంపీని కలెక్టర్ కోరారు. ఈ సమావేశంలో కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య, జెడ్పీ సీఈఓ దీక్షారైనా, డీఆర్‌డీఓ సన్యాసయ్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఈసారైనా చేయూత అందేనా?

- పింఛన్లకు అర్హులను గుర్తించాలని ప్రభుత్వ ఆదేశం
- జిల్లాలో 14,087 దరఖాస్తుల పెండింగ్
- ప్రభుత్వ ప్రకటనతో అర్హుల్లో ఆశలు



విభాగాల వారీగా పింఛన్ల కోసం అందిన దరఖాస్తులు	
కేటగిరీ	దరఖాస్తులు
వృద్ధాప్య	4,989
వితంతు	5,246
దివ్యాంగులు	2,819
గీత కార్మికులు	337
చేనేత కార్మికులు	32
ఒంటరి మహిళలు	664
మొత్తం	14,087

ఖమ్మంమయూరిసెంటర్: ఏ ఆసరా లేని వారిని ఆదుకునేందుకు ప్రభుత్వం చేయూత పథకాన్ని అమలుచేస్తోంది. అయితే జిల్లాలో అర్హులైన పలువురు పింఛన్ల కోసం ఏళ్లుగా ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు అన్ని అర్హతలు ఉన్నా పింఛన్లు మంజూరు కావడం లేదని నిరాశకు లోనవుతున్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పడ్డాక ఆసరా అందుతుందనుకున్న వారు ఏడాది కాలంగా ఎదురుచూపుల్లోనే గడపాల్సి వస్తోంది. అయితే, వీరి కల తీరేలా ప్రభుత్వం ఇటీవల పింఛన్లకు అర్హులను గుర్తించాలని ఆదేశించింది. దీంతో జిల్లాలో దరఖాస్తు చేసుకున్న 14,087 మందిలో ఆశలు చిగురిస్తున్నాయి.

ప్రభుత్వం నుంచి ఓకే..

కాంగ్రెస్ ఆరు గ్యారంటీల్లో ఒకటైన పింఛన్ల పెంపు ఇంకా అమల్లోకి రాలేదు. మహాలక్ష్మి ద్వారా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్, గృహజ్యోతి పథకం కింద పేదలకు 200 యూనిట్లలోపు ఉచితంగా విద్యుత్ సరఫరా చేస్తున్నారు. కానీ అధికారంలోకి వచ్చాక ఆసరా పింఛన్లను రూ.4 వేలకు పెంచుతామని చెప్పిన హామీ నెరవేరలేదు. ఇదిపోగా కొత్త పింఛన్లను సైతం మంజూరు చేయకపోవడంతో జిల్లాలోని పాత పింఛన్‌దారులు, దరఖాస్తుదారులు ఎదురుచూస్తున్నారు. ఈక్రమంలోనే ప్రభుత్వం తాజాగా పింఛన్ల మంజూరుపై దృష్టి సారించింది. జిల్లాల వారీగా అర్హులను ఎంపిక చేయాలన్న సూచనలతో అధికారులు ఆ పనిలో నిమగ్నమైనట్లు తెలిసింది.

రెండేళ్లుగా..

రాష్ట్రంలో రెండేళ్ల నుంచి కొత్త పింఛన్లు మంజూరు చేయడం లేదు. మండల కార్యాలయాలకు వచ్చిన దరఖాస్తులన్నీ పెండింగ్‌లో పెట్టారు. 2022 ఆగస్టులో అప్పటి ప్రభుత్వం వృద్ధాప్య పింఛన్‌దారుల అర్హతను 64 నుండి 57 ఏళ్లకు తగ్గించి కొత్త పెన్షన్లను మంజూరు చేసింది. ఆ తర్వాత మళ్లీ కొత్త పింఛన్లు మంజూరు కాలేదు. ఇక కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఆసరా పథకాన్ని చేయూతగా మార్చినా కొత్త పింఛన్ల మంజూరు చేయకపోవడంతో వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు, కల్లు గీత, బీడీ, చేనేత కార్మికులు, ఫైలేరియా, డయాలసిస్ బాధితులు దరఖాస్తు చేసుకుంటూనే ఉన్నారు.

14,087 దరఖాస్తులు పెండింగ్..

వృద్ధాప్య పింఛన్‌దారులు మృతి చెందితే నెలవారీ పింఛన్ నిలిపేస్తున్నారే తప్ప ఆ వృద్ధుడి భార్యకు వితంతు పింఛన్ మంజూరు చేయలేకపోతున్నారు. జిల్లాలో చేయూత పింఛన్ల కోసం 14,087 వేలకు పైగానే దరఖాస్తులు పెండింగ్ ఉండగా.. ఇందులో వృద్ధాప్య, వితంతు, ఒంటరి మహిళలు, దివ్యాంగుల దరఖాస్తులే ఎక్కువగా ఉన్నట్లు సమాచారం. గత ప్రభుత్వంతో పాటు కొత్త ప్రభుత్వం సైతం ఎటూ తేల్చకపోవడంతో కార్యాలయాల్లో కుప్పలుగా పేరుకుపోగా.. ప్రస్తుత ప్రకటనతో త్వరలోనే పింఛన్లు అందుతాయని భావిస్తున్నారు.

ప్రస్తుతం 1,88,138 మంది

జిల్లాలో ప్రస్తుతం 1,88,138 మంది లబ్ధిదారులకు ఆసరా పింఛన్లు అందుతున్నాయి. ఇందుకోసం ప్రతినెల రూ.39 కోట్లు విడుదల చేస్తున్నారు. ఇందులో వృద్ధాప్య పింఛన్లు 72,166 మందికి, 71,339 మందికి వితంతువు, 28,346 మందికి దివ్యాంగ, 8,503 మంది ఒంటరి మహిళలకు పింఛన్ అందుతోంది. అలాగే, 439 మందికి చేనేత, 3,211 మందికి కల్లుగీత కార్మికులు, ఇద్దరు బీడీ కార్మికులకు ఆసరా పింఛన్లు వస్తుండగా, 1,415 మంది ఫైలేరియా, 134 మంది డయాలసిస్, 2583 మంది ఎయిడ్స్ బాధితులు లబ్ధిదారుల జాబితాలో ఉన్నారు.

క్లుప్తంగా

ముగిసిన అంతర్ జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు



గంగుల నాచారం జట్టుకు నగదు అందజేస్తున్న నిర్వాహకులు

ఏన్కూరు: మండలంలోని గంగుల నాచారంలో మూడు రోజులు జరుగుతున్న ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాల స్థాయి కబడ్డీ పోటీలు ఆదివారం రాత్రి ముగిశాయి. ఈ పోటీలలో 25 జట్లు పాల్గొనగా, ఏన్కూరు మండలం గంగుల నాచారం జట్టు విజేతగా నిలిచింది. ఆతర్వాత స్థానాల్లో సూరారం, గోలిమిల్లు, గంగుల నాచారం(బీ), పుతానీ తండా, చెరువుమాదారం జట్లు నిలిచాయి. విజేతలకు నిర్వాహకులు నగదు బహుమతులతో పాటు ట్రోఫీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ముక్తి వెంకటేశ్వర్లు, మల్కం గంగులు, పూసం సుధీర్, మల్లేష్, భద్రయ్య, భీమరాజు, గోపాలరావు, వినోద్ కుమార్, సీతారాములు, వెంకటేశ్వర్లు, శివకృష్ణ, నాగార్జున, సాగర్, దినేష్, నరేష్ పాల్గొన్నారు.

'కేసీఆర్ మాటల్లో పసలేదు...'



మాట్లాడుతున్న పువ్వాళ్ల దుర్గాప్రసాద్

ఖమ్మంమయూరిసెంటర్: బీఆర్ఎస్ రజతోత్సవ సభలో మాజీ సీఎం కేసీఆర్ చేసిన ప్రసంగంలో పసలేదని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ పేర్కొన్నారు. ఖమ్మంలోని కాంగ్రెస్ జిల్లా కార్యాలయంలో సోమవారం ఆయన రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావుతో కలిసి మాట్లాడారు. మిగులు బడ్జెట్‌తో రాష్ట్రాన్ని అప్పగిస్తే అప్పుల కుప్పగా మార్చడమే కాక ఇప్పుడు తమ ప్రభుత్వంపై విమర్శలుచేయడం సరికాదన్నారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడం హేళన చేయడం బాధాకరమని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, కార్పొరేటర్ కమర్తపు మురళి, నాయకులు మహ్మద్ జావీద్, పుచ్చకాయల వీరభద్రం, గజ్జి సూర్యనారాయణ, మద్ది వీరారెడ్డి, యాస శ్రీశైలం, రజీభాయ్, ఖైజర్, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించండి

తిరుమలాయపాలెం: ప్రకృతి వైద్యం ప్రత్యేకతలను ప్రజలకు వివరిస్తూ మెరుగైన వైద్యం అందించాలని రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ప్రమీలాదేవి సూచించారు. తిరుమలాయపాలెంలోని ప్రకృతి వైద్యశాలను సోమవారం ఆమె తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఓపీ సేవలు, రికార్డులను పరిశీలించాక ఉద్యోగులకు సూచనలు చేశారు. డాక్టర్ పి.కనకలక్ష్మి, జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ బాబూనాయక్, ఫార్మసిస్టులు పి.నరేష్, వెంకటరాజు పాల్గొన్నారు.

స్వయం ఉపాధి శిక్షణా సంస్థలో శిక్షణ

ఖమ్మంరూరల్: రూరల్ మండలం వరంగల్ క్రాస్‌లోని రైసెట్ కేంద్రంలో నిరుద్యోగ యువతకు సీసీ టీవీ కెమెరాల నిర్వహణపై శిక్షణ ఇవ్వనున్నట్లు డైరెక్టర్ సి.చంద్రశేఖర్ తెలిపారు. వచ్చేనెల 1నుంచి 13రోజుల పాటు శిక్షణ ఉంటుందని ఆసక్తి ఉన్న వారు కేంద్రంలో కానీ 63014 38045 నంబర్‌లో కానీ సంప్రదించాలని సూచించారు. ఉచిత శిక్షణతో పాటు భోజన, వసతి కల్పించడమే కాక సామగ్రి అందిస్తామని తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మిర్చి కొనుగోళ్లు పరిశీలన

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో మిర్చి కొనుగోళ్లను మార్కెటింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ పద్మావతి సోమవారం పరిశీలించారు. కొనుగోళ్లలో అక్రమాలు జరుగుతున్నాయనే ఫిర్యాదులతో ఆమె ఇక్కడకు వచ్చినట్లు తెలిసింది. జిల్లాలోని పలు మార్కెట్ల ఉద్యోగులతో కలిసి డీడీ ఖమ్మం మార్కెట్‌లో మిర్చి కొనుగోళ్లను పరిశీలించారు. మిర్చి జెండా పాట, గరిష్ట, కనిష్ట ధరలపై ఆరా తీయడంతో పాటు సీసీఐ పత్తి కొనుగోళ్లలో అక్రమాల వ్యవహారంపై కూడా చర్చించినట్లు సమాచారం.

'నీట్' పకడ్బందీగా నిర్వహించాలి

ఖమ్మంసహకారనగర్: వైద్య కళాశాలల్లో ప్రవేశానికి వచ్చేనెల 4న జరిగే నీట్ పరీక్ష జిల్లాలో పకడ్బందీగా జరిగేలా ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం ఆయన అదనపు డీసీపీ ప్రసాదరావుతో కలిసి వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. నీట్ యూజీ ప్రవేశపరీక్షకు 2,739 మంది విద్యార్థులు హాజరుకానుండగా, ఆరు కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. అన్ని కేంద్రాలను ఒక రోజు ముందే పరిశీలించాలని, సీసీ కెమెరాల పనితీరును పర్యవేక్షించాలని చెప్పారు. వచ్చేనెల 4వ తేదీన మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 5గంటల వరకు పరీక్ష జరగనుండగా, ఉదయం 11నుంచి మధ్యాహ్నం 1-30గంటలకు విద్యార్థులను అనుమతించి, 1-40 కల్లా పత్రాల తనిఖీ పూర్తిచేయాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో నీట్ జిల్లా నోడల్ అధికారి నరేంద్రకుమార్, వివిధ శాఖల అధికారులు కె.రాంగోపాల్‌రెడ్డి, డాక్టర్ బి.కళావతిబాయి, రవిబాబు, శ్రీనివాసాచారి, రవికుమార్, రాంప్రసాద్, విల్సన్ తదితరులు పాల్గొన్నారు.

నృత్యం.. కళారూపం

- వివిధ నృత్యరూపకాల్లో ఖమ్మం వాసుల ప్రతిభ
- పోటీల్లో రాణించడమే కాక ఇంకొందరికి శిక్షణ
- నేడు అంతర్జాతీయ నృత్య దినోత్సవం



ఏపీ మాజీ సీఎం రోశయ్య చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న కళాకారులు, మాస్టర్ మోహన్‌రావు (ఫైల్)

ఖమ్మంగాంధీచౌక్: కళారూపాల్లో ఒకటైన నృత్యం .. సాంస్కృతిక వ్యక్తీకరణకే కాక విద్యాసాధనంగానూ ఉపయోగపడుతోంది. అన్ని కళలతో నాట్యం ముడిపడి ఉండడంతో సమాహార కళగా పిలుస్తారు. ఈ కళా శాస్త్రాన్ని భరతముని అందించినట్లు చెబుతుండగా... సంగీతం మాదిరిగానే నృత్యం కూడా విశ్వవ్యాప్తమైంది. ఫ్రెంచ్‌కు చెందిన ప్రముఖ నృత్యకారుడు జీన్ జార్జెస్ నోవెర్రే జయంతి సందర్భంగా ఏటా ఏప్రిల్ 29న అంతర్జాతీయ నృత్యదినోత్సవంగా జరుపుకుంటున్నారు. అయితే, పలు దేశాల్లో నృత్యానికి చట్టపరమైన సూచనలు లేకపోగా, ప్రభుత్వాలు బడ్జెట్‌లో కేటాయింపులూ చేయడం లేదు. దీంతో ప్రభుత్వ సంస్థల్లో నృత్య విద్యకు ప్రోత్సాహం కొరవడింది.



నాట్యం చేస్తున్న మీనా

నాగరికత ఆధారంగా నృత్యకళ

నాగరికతల ఆధారంగా నృత్యకళ రూపుదిద్దుకోగా.. కాలానుగుణంగా అనేకమార్పులు చోటుచేసుకున్నాయి. దాదాపు రెండు వేల ఏళ్ల కిందటే నాట్య శాస్త్రం రూపుదిద్దుకుంది. మన దేశంలో వివిధ రకాల శాస్త్రీయ నృత్యరీతులు అందుబాటులో ఉన్నాయి. ప్రాంతాల వారీగా భరతనాట్యం, కథక్, కూచిపూడి, ఒడిస్సీ, కథాకళి, మణిపురి, మోహినీయాట్టం వంటివి గుర్తింపు పొందాయి. ఇక తెలుగు రాష్ట్రాల్లో పేరుగాంచిన కూచిపూడి, పేరిణి దేశవ్యాప్తంగానూ గుర్తింపు సాధించాయి. పేరిణి నృత్యం కాకతీయుల కాలంలో ప్రాచుర్యం పొందగా.. దీనికి తెలంగాణ నృత్యమని, యోధుల నృత్యమని పిలుస్తారు. యోధులు యుద్ధానికి వెళ్లే ముందు శివుడిని ఆరాధిస్తూ ఈ నృత్యం చేసే వారని ప్రతీతి.

కళల గుమ్మం.. ఖమ్మం

కళల గుమ్మంగా ఖమ్మంకు పేరు. ఈక్రమంలోనే వివిధ కళలకు ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం ఉండగా.. నాట్య కళకు మాత్రం ఆ పరిస్థితి కానరాదు. నాట్యం విద్యకు ముడిపడి ఉన్నప్పటికీ ప్రభుత్వ విద్యాసంస్థల్లోనూ ప్రాధాన్యత దక్కడం లేదు. అక్కడక్కడా ప్రైవేట్ సంస్థలు మాత్రం ఆసక్తి ఉన్న వారికి శిక్షణ ఇస్తున్నాయి. దీంతో పలువురు రాష్ట్ర, జాతీయ స్థాయిలో గుర్తింపు సాధించారు.

నృత్య పండిత 'మోహను'డు

కూచిపూడి నృత్యంలో ఖమ్మంకు చెందిన కే.జీ.మోహన్‌రావు పేరు గడించారు. పదేళ్ల వయసులోనే కూచిపూడిలో ప్రావీణ్యం సాధించిన 53 ఏళ్లుగా ఎందరికో శిక్షన ఇచ్చారు. 1981 నుంచి తెలుగు రాష్ట్రాల్లో అనేక ప్రదర్శనలు ఇచ్చినాయన ఇతర రాష్ట్రాల్లోనూ తన కళ ద్వారా గుర్తింపు పొందారు. ఖమ్మం బాలభవన్‌లో అనాథ పిల్లలకు నేర్పించిన ఆయన హైదరాబాద్ లలితకళా తోరణంలో నిర్వహించిన ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్‌లో 60 మంది అనాథ పిల్లలతో నృత్య ప్రదర్శన ఇప్పించారు. 1978లోనే నృత కళాభారతి సంస్థను ఏర్పాటుచేసి శిక్షణ ఇస్తున్నారు.

పేరిణి.. వీరూనాయక్

తెలంగాణ నృత్య కళారూపంగా భావించే పేరిణి నృత్యాన్ని జిల్లాలో వీరూనాయక్ తెరపైకి తీసుకొచ్చాడు. కూసుమంచి మండలానికి చెందిన ఆయన పదిహేనేళ్ల క్రితం పేరిణి నృత్యం నేర్చుకొని ఖమ్మంలో నృత్యాలయం ద్వారా పేరిణి శివ తాండవంపై శిక్షణ ఇస్తున్నారు. ఇప్పటి వరకు సుమారు 500 మందికి శిక్షణ ఇవ్వగా.. అందులో పలువురు ప్రదర్శనల ద్వారా గుర్తింపు సాధించారు. ఇక వీరూనాయక్ స్వర్ణకంకణ, సర్వ కళా ప్రతిభ, నంది అవార్డులతో పాటు కళారాధన, స్వర్ణనంది అవార్డులు పొందారు.



పేరిణి నృత్యం చేస్తున్న వీరూనాయక్ (కుడి నుంచి మొదటి వ్యక్తి)

నాట్యమయూరి 'మీనా'

ఖమ్మం నగరానికి చెందిన మీనాకు నాట్యంలో మంచి గుర్తింపు ఉంది. ఐదేళ్ల వయసు నుంచే అభ్యాసన ప్రారంభించిన ఆమె కూచిపూడిలో డిప్లొమా పూర్తి చేసి 12 ఏళ్లుగా వందలాది మంది చిన్నారులకు శిక్షణను ఇస్తున్నారు. ఆమె స్వతహాగా దేశంలోని పలు ప్రాంతాల్లోనూ కాక మలేషియా, సింగపూర్ తదితర దేశాల్లో ప్రదర్శనలు ఇవ్వడం విశేషం. మీనా నృత్య ప్రదర్శనలకునాట్యమయూరి, నాట్యకౌముది, తెలుగు తేజం, నాట్య గురురత్న, నాట్య శిరోమణి తదితర అవార్డులు గెలుచుకుంది.

పాఠశాలల తెరిచే నాటికి సమస్యలు పరిష్కరించాలి

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు రజినీకాంత్, నాగరాజు

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్రంలో పలు చోట్ల ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతిగృహాలు శిథిలావస్థకు చేరినందున వేసవి సెలవులు ముగిసే నాటికి మరమ్మతులు పూర్తిచేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు శనగారపు రజనీకాంత్, తాళ్ల నాగరాజు డిమాండ్ చేశారు. ఖమ్మంలోని సుందరయ్య భవనంలో సోమవారం ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఖమ్మం కేంద్రంగా మూడు రోజుల పాటు నిర్వహించిన ఎస్ఎఫ్ఐ 5వ రాష్ట్ర మహాసభలు విజయవంతం అయ్యాయని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాలు, సెంట్రల్ యూనివర్సిటీల ప్రతినిధులు పాల్గొనగా, విద్యా రంగ సమస్యలపైనే 7గంటలకు పైగా చర్చ జరిగిందని తెలిపారు. ఈ సభల్లో 23 తీర్మానాలను ఆమోదించి, భవిష్యత్ కార్యాచరణ రూపొందించామని వెల్లడించారు. తెలంగాణ ఫౌండేషన్ స్కూళ్ల ఏర్పాటుతో పేదలకు విద్య దూరమవుతుందని, ఐదు కిలోమీటర్లకు ఒక ప్రభుత్వ పాఠశాల ఉండాలనే నిబంధన మేరకు ప్రభుత్వం తన నిర్ణయాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే, గురుకులాలకు సొంత భవనాలు నిర్మించాలని, యూనివర్సిటీలకు నిధులు కేటాయించి ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని, స్కాలర్లకు ఫెలోషిప్ విడుదల చేయాలని కోరారు. అంతేకాక ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామర కిరణ్, రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్ ఎం.పూజ, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సుధాకర్, తుడుం ప్రవీణ్‌తో పాటు దొంతబోయిన వెంకటేష్, వినోద్, జీవన్, త్రినాథ్, లోకేష్, స్వాతి, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు

టీఆర్‌లపై మెమోలు జారీ

సాక్షి ఎఫెక్ట్..

ఖమ్మంవ్యవసాయం: పత్తి కొనుగోళ్ల సమయాన తాత్కాలిక రిజిస్ట్రేషన్(టీఆర్)ల్ల జారీలో అక్రమాలు జరిగాయనే ఆరోపణల నేపథ్యాన వివరణ ఇవ్వాలని మార్కెట్ కార్యదర్శులకు రాష్ట్ర మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ సోమవారం మెమోలు జారీ చేశారు. జిల్లాలో సీసీఐ పత్తి కొనుగోళ్ల సందర్భంగా తాత్కాలిక రిజిస్ట్రేషన్లలో చోటు చేసుకున్న అక్రమాలపై సోమవారం 'దళారులకు అండగా యంత్రాంగం' శీర్షికన 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన అధికారులు పత్తి కొనుగోళ్లు చేపట్టిన మార్కెట్ల కార్యదర్శులుకు మెమోలు జారీ చేశారు. ఖమ్మం, వైరా, మధిర, నేలకొండపల్లి, మద్దులపల్లి మార్కెట్ల పరిధిలో తాత్కాలిక రిజిస్ట్రేషన్లు ఎలా జారీ చేశారు, అర్హులైన రైతులను ఎలా గుర్తించారనే వివరాలతో నివేదిక ఇవ్వాలని అందులో సూచించారు. ఇప్పటికే ఈ అంశంలో రాష్ట్రవ్యాప్తంగా విజిలెన్స్ విచారణ జరుగుతుండగా, రాష్ట్ర మార్కెటింగ్ శాఖ జారీ చేసిన మెమోలకు సోమవారమే పలు మార్కెట్ల కార్యదర్శులు వివరణ ఇచ్చినట్లు తెలిసింది. ఈ వివరణల ఆధారంగా ఎలాంటి చర్యలు తీసుకోనున్నారో తేలాల్సి ఉంది. అయితే, భద్రాద్రి జిల్లాలోని పత్తి కొనుగోలు చేసిన నాలుగు మార్కెట్ కమిటీల అధికారులు, ఉద్యోగులను సోమవారం విజిలెన్స్ విభాగం అధికారులు వరంగల్‌కు పిలిపించి రికార్డుల ఆధారంగా విచారణ చేపట్టారు.

మెడికల్ కాలేజీకి సీపీఎం నేత మృతదేహం అప్పగింత



మధుసూదన్‌రావు మృతదేహాన్ని అప్పగిస్తున్న కుటుంబీకులు

ఖమ్మంవైద్యవిభాగం/కొణిజర్ల: కొణిజర్ల మండలం లాలాపురంలో ఇటీవల మృతి చెందిన సీపీఎం సీనియర్ నాయకుడు సంక్రాంతి మధుసూదన్‌రావు మృతదేహాన్ని ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కాలేజీకి అప్పగించారు. మరణానంతరం తన దేహం వైద్య విద్యార్థులకు ఉపయోగపడాలన్న మధుసూదన్ రావు విజ్ఞప్తితో సోమవారం ఖమ్మం మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ రాజేశ్వరరావు, అనాటమీ హెచ్‌ఓడీ డాక్టర్ చండీప్రియ, జనరల్ మెడిసిన్ హెచ్‌ఓడీ డాక్టర్ నారగాని రాంప్రసాద్‌కు ఆయన కుటుంబీకులకు అప్పగించగా.. సర్టిఫికెట్ అందజేశారు. మధుసూదన్‌రావు కుమారుడు రవికుమార్, అల్లుడు నామ వెంకటేశ్వరరావు, నాయకులు కళ్యాణ వెంకటేశ్వరరావు, చింతనిప్పు చలపతిరావు, అనుమోలు రామారావు, కవి కన్నెగంటి వెంకటయ్య, మాజీ సర్పంచ్ సంక్రాంతి చంద్రశేఖర్, ఫ్రెండ్స్ యూత్ అధ్యక్షుడు తాటిపల్లి సుధీర్ పాల్గొన్నారు.

నా అనే వారెవరూ లేరని బలవన్మరణం



జయ (ఫైల్)

ఖమ్మంక్రైం: భర్త, ఇద్దరు కొడుకులు మృతి చెందారు... నా అన్న వాళ్లెవరూ లేరు.. దీనికి తోడు అనారోగ్య సమస్యలు వెంటాడుతుండడంతో జీవితంపై విరక్తి చెందిన మహిళ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకుంది. ఖమ్మం జహీరపుర తండాకు చెందిన ధోన్‌వాన్ జయ(53) భర్త బాలు పదేళ్ల క్రితమే మృతి చెందాడు. ఆమె పెద్దకుమారుడికి వివాహం జరగకపోగా భర్త చనిపోయిన కొన్నాళ్లకే కుమారుడు సైతం కన్నుమూశాడు. చిన్న కుమారుడికి వివాహమై ఇద్దరు జన్మించాక మృతి చెందగా కోడలు పిల్లలతో సహా పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటినుంచి ఒంటరిగా జీవిస్తున్న జయ కొన్నాళ్లుగా అనారోగ్యంతో బాధపడుతూ ఉంది. భర్త సోదరులు, వారి కుటుంబీకులు సాయపడుతున్నా నా అనే వారెవరే లేరనే బాధతో చర్చి కాంపౌండ్ ప్రాంతంలో రైల్వే బ్రిడ్జి వద్ద సోమవారం రైలు కిందపడి ఆత్మహత్య చేసుకుంది. ఈమేరకు అన్నం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు సహకారంతో మృతదేహాన్ని మార్చురీకి తరలించినట్లు జీర్పీ హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణ తెలిపారు.

మున్నేటిలో పడి మత్స్యకారుడు మృతి

ఖమ్మంక్రైం: ఖమ్మం త్రీటౌన్ ప్రాంతాన మున్నేటిలో చేపల వేటకు వెళ్లిన మత్స్యకారుడు అందులో మునిగి మృతి చెందాడు. పంపింగ్‌వెల్ రోడ్డు ప్రాంతానికి చెందిన మర్రి వీరస్వామి(48) కొంతకాలంగా మహబూబాబాద్ జిల్లా మొగిలిచర్లలో నివాసముంటూ సుతారీ పనులకు వెళ్తున్నాడు. మత్స్యకార సహకార సంఘంలో సభ్యుడైన ఆయన చేపలు పట్టేందుకు తెప్పపై ఆదివారం సాయంత్రం మున్నేటిలోకి వెళ్లాడు. రాత్రి దాటాక తెప్ప ఖాళీగా ఉండడాన్ని గుర్తించిన సహచరులు ఇంటికి వెళ్లి ఉంటాడని భావించారు. అయితే, కుటుంబసభ్యులను ఆరా తీయగా వీరస్వామి రాలేదని చెప్పడం.. ఆయనకు ఈత రావడంతో నీళ్లలో మునిగే అవకాశం లేదని సోమవారం ఉదయం వరకు ఎదురుచూశారు. అనంతరం మున్నేటిలోకి దిగి గాలించగా వీరస్వామి మృతదేహం లభ్యమైంది. ఘటనపై కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు సీఐ రమేష్ తెలిపారు.

'భూ భారతి'ని సంతోషంగా ఆహ్వానించండి

- తప్పులను సరిదిద్దడానికి కొత్త చట్టం
- అవగాహన సదస్సులో కలెక్టర్, ఎంపీ



సత్తుపల్లిలో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, పక్కన ఎంపీ రఘురాంరెడ్డి, ఎమ్మెల్యే రాగమయి తదితరులు

సత్తుపల్లి/వేంసూరు: భూ భారతి చట్టంతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించనున్న నేపథ్యాన అందరూ సంతోషంగా ఆహ్వానించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచించారు. ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అధ్యక్షతన సోమవారం సత్తుపల్లి, వేంసూరు మండలాల్లో భూ భారతి అవగాహన సదస్సులు నిర్వహించారు. సత్తుపల్లిలో జరిగిన కలెక్టర్ మాట్లాడుతూ1930-1950లో భూ సర్వే జరగగా, అప్పటి నుంచి బై నంబర్లతోనే పట్టాలు ఇస్తుండడం, సాదాబైనామాలతో సమస్యలు ఎదురవుతున్నాయని చెప్పారు. ఈనేపథ్యాన కొత్త చట్టంలో భాగంగా జీపీఎస్ పరిజ్ఞానంతో రెండు అధునాతన యంత్రాలతో సర్వే చేయించి భూ రికార్డులు సిద్ధం చేస్తామని తెలిపారు. తద్వారా చాలావరకు సమస్యలు పరిష్కారమవుతాయని చెప్పారు. ఇందులో అప్పీల్‌కు మూడంచెల వ్యవస్థ ఉన్నందున ఎవరినీ అన్యాయం జరగలేదని పేర్కొన్నారు.

అన్ని సమస్యలకు పరిష్కారం

ధరణితో ఎదురైన సమస్యలను అధిగమించేలా ఏడాది పాటు సీఎం రేవంత్‌రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నిపుణుతో చర్చించి భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చారని ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి తెలిపారు. తద్వారా రైతుల బాధలు తీరనున్నాయని చెప్పారు. ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి మాట్లాడుతూ బీఆర్ఎస్ హయాంలో ధరణి ద్వారా ఎందరో రైతులకు అన్యాయం జరిగిందని.. ఇప్పుడు అలా జరగకుండా సత్వర న్యాయం కోసమే భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చామని తెలిపారు. కల్లూరు ఆర్‌డీఓ రాంజేంద్రగౌడ్, సత్తుపల్లి, వేంసూరు తహసీల్దార్లు యోగేశ్వరరావు, బాబ్జీప్రసాద్, నాయకులు డాక్టర్ మట్టా దయానంద్, దోమ ఆనంద్‌బాబు, చల్లగుండ్ల కృష్ణయ్య, గాదె చెన్నారావు, శివవేణు, దొడ్డా శ్రీనివాసరావు, తోట సుజాలరాణి, మందపాటి పద్మజ్యోతిరెడ్డి, పుచ్చకాయల సోమిరెడ్డి, కాసరి చంద్రశేఖర్‌రెడ్డి, అట్లూరి సత్యనారాయణరెడ్డి, గొర్ల వెంకటప్పరెడ్డి, కొప్పుల వెంకటేశ్వరరెడ్డి ,రైతులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు సహకరించాలి

ఖమ్మంసహకారనగర్: జాతీయ రహదారుల నిర్మాణంతో ఇతర అభివృద్ధి పనులకు భూయజమానులు సహకరించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచించారు. ఖమ్మం ఆర్డీఓ కార్యాలయంలో భూనిర్వాసితులతో కలెక్టర్ సమావేశమయ్యారు. ఈసందర్భంగా చింతకాని మండలంలోని కొదుమూరు, వందనం రైతులు మాట్లాడుతూ ఇప్పటికే సూర్యాపేట, దేవరపల్లి హైవేలతో పొలాలు కోల్పోయామని, మళ్లీ అమరావతి - నాగపూర్ రహదారికి భూమి సేకరిస్తే చిన్న, సన్నకారు రైతులు రోడ్డున పడతారని తెలిపారు. భూమితో పాటు ఉన్న పైపులు, కట్టడాలు, సుబాబుల్, జామాయిలు చెట్లను కూడా పరిగణనలోకి తీసుకుని పరిహారం ప్రకటించాలని కోరారు. దీంతో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ స్పందిస్తూ ప్రభుత్వ పరిధిలో మెరుగైన పరిహారం అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ప్రత్యేక చొరవతో గ్రామాలకు సర్వీస్ రోడ్డు మంజూరైందని, మిగులు భూములకు డిమాండ్ పెరుగుతుందని తెలిపారు. ఆర్డీఓ నరసింహారావు, తహసీల్దార్ అనంతరాజు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బంది లేకుండా కొనుగోళ్లు

పెనుబల్లి: రైతులు వేచిచూడకుండా ఎప్పటికప్పుడు ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచించారు. పెనుబల్లి మండలం రామచందర్‌రావు బంజర్ కేంద్రంలో కొనుగోళ్లను సోమవారం ఆయన పరిశీలించి సూచనలు చేశారు. తహసీల్దార్ గంటా ప్రతాప్, ఎంపీఈఓ ఉపేంద్రయ్య, వ్యవసాయశాఖ సంచాలకులు నరేష్, ఏపీఓ జ్యోతి ప్రసన్న పాల్గొన్నారు.

తరుగు లేకుండా ధాన్యం కొనాలి..



వైరాలో రాస్తారోకోతో నిలిచిపోయినన వాహనాలు

వైరా మార్కెట్ ఎదుట రాస్తారోకో

వైరా: వైరా మార్కెట్‌లో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో తేమ, తరుగు పేరిట జాప్యం చేస్తున్నారంటూ సీపీఐ, సీపీఎం రైతు సంఘాల ఆధ్వర్యాన రైతులు సోమవారం ఆందోళన చేపట్టారు. మార్కెట్ ఎదురుగా వైరా - మధిర ప్రధాన రహదారిపై బైఠాయించడంతో గంట పాటు వాహనాలు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం అధ్యక్షుడు బాగం హేమంతరావు, సీపీఐ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు మాట్లాడుతూ ధాన్యం తీసుకొచ్చి 20 రోజులు దాటుతున్నా తేమ ఎక్కువగా ఉందని జాప్యం చేస్తుండడమే కాక క్వింటాకు ఐదు కేజీల తరుగు తీస్తున్నారని పేర్కొన్నారు. ఆపై మిల్లులకు పంపించినా మిల్లర్లు సైతం ఇబ్బంది పెడుతున్నారని తెలిపారు. కాగా, ధర్నాతో వాహనాలు భారీగా నిలిచిపోగా తహసీల్దార్ కే.వీ.శ్రీనివాస్, ఏఓ మయాన్ మంజుఖాన్, ఎస్ఐ వంశీకృష్ణ భాగ్యరాజ్ చేరుకుని రైతులు, నాయకులతో చర్చించారు. జిల్లా ఉన్నతాధికారులకు ఫోన్ ద్వారా వివరించడంతో తరుగు లేకుండా ధాన్యం కొనుగోళ్లు జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వగా ఆందోళన విరమించారు. నాయకులు దండి సురేష్, సింగు నరసింహారావు, జమ్ముల జితేందర్‌రెడ్డి, తోట రామాంజనేయులు, పోటు కళావతి, భూక్యా వీరభద్రం, ఎం.రామారావు, వెంకటేశ్వరరావు, ఎస్.కే.సైదులు, కె.రవి, బి.నాగేశ్వరరావు, రత్నాకర్, జె.గోపాలరావు, ఎం.మల్లికార్జున్, శ్రీనివాసరావు, హరికృష్ణ, మధు, గోవిందరావు, కొండలరావు, నిర్మల, తన్నీరు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ గేట్‌కు తాళాలు వేసి నిరసన



నేలకొండపల్లి మార్కెట్ గేట్ వద్ద నిరసన తెలుపుతున్న రైతులు

నేలకొండపల్లి: ధాన్యం తీసుకొచ్చి నెల దాటినా కాంటా వేయకపోగా, కాంటా వేసిన బస్తాలను ఎగుమతి చేయడం లేదని నేలకొండపల్లిలో రైతులు ఆందోళనకు దిగారు. మార్కెట్ ఆవరణలో డీసీఎంఎస్ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రం బాధ్యులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూ మార్కెట్ ప్రధాన గేట్‌కు తాళాలు వేసి అధికారులు, సిబ్బందిని లోపలికి వెళ్లకుండా అడ్డుకున్నారు. ఆ సమయాన వచ్చిన ఏఓ ఎం.రాధ, మార్కెట్ చైర్మన్ వెన్నపూసల సీతారాములుకు తమ ఆవేదన వినిపించారు. జిల్లా అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

మిల్లర్లు దింపుకోవాల్సిందే...

మిల్లుల సామర్థ్యం దాటిందని చెబుతూ ధాన్యం దిగుమతి చేసుకోకపోవడం సరికాదని మార్కెట్ చైర్మన్ సీతారాములు పేర్కొన్నారు. రైతువేదికలో మిల్లర్లు, రైతులతో సమావేశం ఏర్పాటుచేయగా ఆయన మాట్లాడారు. ఈసారి ధాన్యం దిగుబడి పెరిగినందున మిల్లర్లు సహకరించాలని సూచించారు. మండలంలో 24 వేల బస్తాలు కాంటాలు వేయగా, మరో 24 వేల బస్తాలు కాంటాలు వేయాల్సి ఉందని.. ఇంకా 37 వేల బస్తాలు దిగుబడి వచ్చే అవకాశం ఉందని చెప్పారు. ఈమేరకు మిల్లర్లు ధాన్యం దిగుమతి చేసుకోవాలన్నారు. తహసీల్దార్ వి.వెంకటేశ్వర్లు, ఏఓ ఎం.రాధ, ఆర్ఐ నరేష్‌తో పాటు శాఖమూరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

చెల్లని చెక్కు కేసులో ఆరు నెలలు జైలుశిక్ష

ఖమ్మం లీగల్: తీసుకున్న అప్పు చెల్లించే క్రమాన చెల్లని చెక్కు జారీ చేసిన వ్యక్తికి ఆరు నెలల జైలుశిక్ష విధిస్తూ ఖమ్మం రెండో అదనపు ప్రథమ శ్రేణి కోర్టు న్యాయమూర్తి వై. బిందుప్రియ సోమవారం తీర్పు చెప్పారు. ఖమ్మంకు చెందిన ఎం.శంకరరావు వద్ద మంకెన రమేష్ 2017 నవంబర్‌లో రూ.3లక్షల అప్పుగా తీసుకున్నాడు. తిరిగి 2019 జూన్‌లో రూ.3లక్షలకు చెక్కు ఇవ్వగా, బ్యాంకులో జమ చేస్తే రమేష్ ఖాతాలో సరిపడా నగదు లేక తిరస్కరణకు గురైంది. దీంతో శంకరరావు తన న్యాయవాది ద్వారాలీగల్ నోటీస్ జారీ చేసి కోర్టులో ప్రైవేట్ కేసు దాఖలు చేశాడు. విచారణ అనంతరం రమేష్‌కు ఆరు నెలల జైలుశిక్ష విధించడమే కాక ఫిర్యాదికి రూ.3లక్షలు చెల్లించాలని న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

మహిళ మృతదేహం అవశేషాలు

సత్తుపల్లిటౌన్: ఉపాధి హామీ పనుల వద్ద మహిళ మృతదేహం అవశేషాలు బయటపడ్డాయి. సత్తుపల్లి మండలం కాకర్లపల్లికి చెందిన ఉపాధి కూలీలు స్థానిక తామర చెరువు సమీపాన జామాయిల్ ప్లాంటేషన్ వద్ద సోమవారం పనులు చేస్తున్నారు. అక్కడ సుమారు మీటర్ లోతు తవ్వగా చీర, జాకెట్, మహిళ మృతదేహం అవశేషాలు బయటపడ్డాయి. దీంతో వారు ఆందోళనకు గురయ్యారు. కొందరు కూలీలు వాటిని ఫోటోలు తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు.

పల్లె ప్రకృతివనంలో అగ్నిప్రమాదం

తల్లాడ: తల్లాడలోని పల్లె ప్రకృతి వనంలో సోమవారం మంటలు వ్యాపించాయి. సమీపంలోని రైతులు తన పొలంలో చెత్తకు నిప్పు పెట్టగా, మంటలు వ్యాపిస్తూ పల్లె ప్రకృతివనం వరకు చేరాయి. అక్కడి ఎండిగడ్డి కాలిపోతుండగా, గ్రామపంచాయతీ ఈఓ కృష్ణారావు ట్యాంకర్ ద్వారా నీరు చల్లిస్తూనే సత్తుపల్లి అగ్నిమాపక శాఖ ఉద్యోగులకు సమాచారం ఇచ్చారు. దీంతో వాహనంతో వచ్చిన ఉద్యోగులు మంటలను ఆర్పివేశారు. ఈ ఘటనలో వనంలో చెట్లకు ఎలాంటి నష్టం జరగలేదని ఈఓ తెలిపారు.